# 3

## పాబ్లో నెరూడా

"జీవితం అంటే విప్లవం: మార్పు. సిద్ధాంతాలు చస్తాయి; విప్లవం చిరంజీవి" అన్నవాడు పాబ్లో నెరూడా.

"ఇది చిలీదేశం ఇక్కడ కేడిలక్ కార్లున్నాయి. రక్తం గడ్డకట్టుకుపోయే మంచుమీద పాదరక్షలు లేకుండా నడిచే పాదాలున్నాయి. నువ్వు కవివయితే అటో, ఇటో చేరాలి; చేరితీరాలి; తప్పదు. నేను, నా కవిత ఆ పాదాలవైపు చేరాము"— అని తన కవితను ఆ కన్నీటిని తుడిచే రుమాలుగా, తన కలాన్ని అన్యాయం గుండెమీదకు విసిరిన కత్తిగా, వాడిన వాడు పాబ్లో 'నెరూదా'.

* * *

పాబ్లో నెరూదా అసలు పేరు అదికాదు. మనవారి "చిన తిప్పావఝుల వీరసూర్య వెంకట సుబ్రహ్మణ్య సీతారామాంజనేయరావు"—లాగే అతడి పేరులోనూ ఒకింత 'తెలుగుదనం' వుంది,-"నెప్తాలి, రికార్డోరీయ్స బసోల్టో—" అన్న పేరుతో పుట్టిన ఈ కవి తన పేరెందుకు మార్చుకొన్నాడో తెలిస్తే వింతగా వుంటుంది వాళ్ళ వూళ్ళో ఒక అందమైన విద్యార్థినిని ప్రేమించిన మిత్రుడు అడగడంతో అతడు తన మొదటి ప్రేమ లేఖను వెలయించాడు. కొన్నాళ్ళకు ఆ అమ్మాయికీ విషయం తెలిసి "ఏమబ్బాయ్! ఆ కవిత్వం రాసింది నువ్వేనా?" అని అడిగితే సిగ్గుతో

పొనన్నాడు బసోల్టో- ఆ అమ్మాయి అతడికీ తాయిలం ఇచ్చింది! బసోల్టో మనసులో ప్రేమ పీఠం వేసుక్కూచున్న ఆ పిల్లకోసం అతడు కవిత్వం నిండిన లేఖలు రాయసాగాడు. అందుకనే— "ప్రకృతి-ప్రేమ, నా తొలి ప్రేరణలు" అన్నాడు నెరూదా.

ఈ బాలకవి నాన్నగారికి కవిత్వమంటే అస్సలు పడేదికాదు. అందుకని తండ్రికి తెలియకుండా వుండాలని బసోల్టో మారుపేరు కోసం వెతుకుతుండగా ఒక పత్రికలో— "పాబ్లో నెరూదా — అన్న పేరు కన్పించింది. వెంటనే ఆ పేరును తనదిగా చేసుకున్నాడు ఈ పధ్నాలుగేళ్ళ కవి కిశోరం.

ఆ తర్వాత చాల దశాబ్దాల తర్వాత, తన కొత్తపేరు స్థిరపడి, కవితాకాశంలో నక్షత్రంగా మెరుస్తుండగా తన పేరు చెబుతూ పాబ్లో నెరుదా—

"ఆ పత్రికనుంచి ఈపేరు నెన్నుకున్నప్పుడు, నాకు అది చాల అందమైన సుదీర్ఘమైన పాటలూ, పద్యాలూ రాసిన ఒక జెక్ కవి పేరని తెలియదు. ఎన్నో ఏళ్ళ తర్వాత నేను జెకోస్లోవేకియాలోని ప్రాహా నగరానికి వెళ్ళినప్పుడు నేను ఆ మహానుభావుడి విగ్రహం వద్ద పూవుల నుంచాను—" అన్నాడు.

—బాగా చిన్నతనంలో ఒకరోజు నెరూదా మనసెందుకో ఉద్విగ్న మయింది ఆ ఉద్వేగాన్ని అతడు కాగితంమీద పెట్టినపుడు— ఆ పర్షించిన మాటలు, ఆవరుసలు తను రోజూ మట్లాడేవి కాదని అతనికి తెలిసింది. అది ముగించగానే అతడిని సంజ వెలుతురులాంటి అందమైన, భారమైన, తియ్యని విచారంలాటి భావమేదో ఆవహించింది. అతడిని ప్రేమతో దేవతలా చూచుకుంటూ వచ్చిన సవతితల్లిమీద రాసిన ఆ కవిత నెరూదా మొదటి కవిత.

ఆ కవితను పట్టుకుని భయంభయంగా తల్లిదండ్రుల దగ్గరకు వెళ్లాడు నెరూదా- ఆ తర్వాత జరిగిన దానిని నెరూదా ఇలా చెప్పారు.

"అప్పుడు మా నాన్న అమ్మ భోజనాల టేబిల్ దగ్గర కూర్చొని వున్నారు. వాళ్ళేదో రహస్యంగా — పెద్దలు మాట్లాడే గాంభీర్యంతో మాట్లాడుకుంటున్నారు నేను వణుకుతున్న చేతులతో నా మొట్టమొదటి కవితను ముందుకు చాచాను మా నాన్న నిర్లక్ష్యంగా దానిని అందుకుని, నిర్లక్ష్యంగా దానిని చదివి, నిర్లక్ష్యంగా నా చేతికిచ్చివేస్తూ- "ఎక్కడినుండి కాపీకొట్టేవు దీనిని?" అన్నాడు; అని వెంటనే మా అమ్మతో అతి ముఖ్యమైన విషయాల చర్చలో లీనమైపోయాడు.

"అదీ నా మొదటి కవిత జనన వృత్తాంతం. అంతేకాదు- అశ్రద్ధతో అనాలోచితంగా, బాధ్యతా రహితంగా సాగే సాహిత్య విమర్శను నేను తొలిసారి రుచి చూడటంకూడ అప్పుడే సుమండీ!" అంటాడు నెరూదా . .

— ఎందరు రచయితల గాయపడిన మనసులకు అద్దం ఇది!!...

...ఆ తర్వాత—

ముప్పైయెదేళ్ళ వయసులో- కొత్త శిఖరాల నధిరోహిస్తున్న సమయంలో, వారం వారం 'ఎల్ సోల్' అనే స్పానిష్ పత్రికలో 'తనను' అకారణంగా అదేపనిగా విమర్శిస్తూ వచ్చిన స్పానిష్ కవి జ్వాన్ రేమోన్ జిమెనేజ్ గురించి నెరూదా ఇలా అంటాడు.

"జిమెనేజ్ నాకు స్పానిష్‌వారి అసూయగురించి నేర్పాడు. అతడొక గొప్ప కవి. అతడి కవితలు కాంతిపుంజాలు. అతడికి ఇంకెవరిని చూచీ అసూయపడాల్సిన అవసరం లేదు. అయినా తన్ను మించిన కీర్తి ఇంకెవరి

కయినా వస్తుందేమోనన్న భయం అతడికి వుండేది కాబోలు. గార్షియాలోర్కా ఆల్బెర్టి, జోర్గ్ గుయిల్లెన్, పెడ్రో సలినాస్ —- మొదలయినయువకవులను ఏల్చి చెండాడేవాడు. ప్రతి ఆదివారం ప్రచురించే తన విమర్శలో వాళ్ళ కవితలను హింసించేవాడు. నామీద కూడా వారం వారం విమర్శల పరంపర కురిపించే వాడు.

“ఏది ఏమయినా అతడికి సమాధానం ఇవ్వకూడదని నిశ్చయించు కున్నాను. ఎప్పుడూ ఇవ్వలేదుకూడా. సాహిత్యవిమర్శలకు ప్రతి విమర్శలు రాయడం నా కిష్టంలేదు. నేనా పని ఎప్పుడూ చెయలేదు—” అన్నాడు—ఆకలి పక్కన, కన్నీటి పక్కన, అసహాయత పక్కన తన కవితా ప్రపంచంతో నిలబడిన మహాయోధుడు పాబ్లో నెరూదా!

ఆ ఆశయం, ఆ సహనం, సంయమనంవుంటే ఈనాటి మన సాహిత్య విమర్శలోని కొన్ని ‘వాసన’ వేసే అధ్యాయాలు అసలుండేవి కావేమో...

“యద్యదాచరతి శ్రేష్ఠః”

తత్తదేవేతరో జనః” మాన్యులు ఎట్లా వ్యవహరిస్తారో సామాన్యులూ అంతే కదా—

ఈ సూత్రం మన ఈనాటి సాహిత్య దిక్పాలకులకూ, రాజకీయ పాలకులకూ వర్తించదు—అనుకుందామా?

---